

# జాయ సేనాపతి

70 ధారావాహిక

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284

**జరిగిన కథ :** పుళిందపుడితో కలిసి నడుస్తున్న జాయపుణ్ని ఓ పదిమంది బలాఢ్యులు చుట్టుముట్టి.. కళ్లకు గంతలు కట్టి, తెలియని ప్రదేశానికి తీసుకెళ్లారు. అయితే, తనను అక్కడికి తీసుకొచ్చింది ముమ్మడినాయకుడేననీ, అందుకు పుళిందపుడు సహకరించాడని గుర్తించాడు జాయపుడు. పిష్టపుర యుద్ధం జరిగిన ఐదేళ్ల తర్వాత.. జాయపునిలోని యుద్ధవీరుడు తిరిగి మేల్కొన్నాడు. కారు చీకట్లోనే.. ఎవ్వరూ ఊహించనంత వేగంగా లేచి, ఆ ఆగంతకులందర్నీ పుష్టిగా కుమ్మాడు జాయపుడు. ఆ తర్వాత గుర్తొచ్చింది జాయపునికి.. తన కంచుకంలో గజ్జెల పట్టీలు ఉన్నట్లు!

ఉదయం నాట్య గురుకులానికి వెళ్లిన జాయపుడు అటునుంచి జైన బసదికి వచ్చాడు. జైన బసది వద్ద పుళిందపుడు కలిశాడు. నాట్య అభ్యాసవేళ ధరించిన గజ్జెలపట్టీలు కంచుకంలోనే ఉన్నాయి. వాటిలో ఒకదాన్ని మెల్లగా బయటికి తీసి.. తన చేతికి కట్టుకున్నాడు.

''ఒరే! ఎవడికైనా దమ్ముంటే.. ఇదిగో ఈశబ్దం నా చేతికున్న గజ్జెలపట్టీది. నన్ను గుర్తుపట్టిస్తుంది. రండి నాపైకి..'' అంటూ గజ్జె కదిపాడు.

ఎవరో మీదికొచ్చాడు.. లిప్త కాలంలో చావుకేక పెట్టాడు. జాయపుడు కూడా చావుకేకలు పెడుతున్నాడు. మళ్లీ ఎవడో ఎవడి మీదో వచ్చిపడ్డాడు.. మరొకడెవడో అరిచాడు. ఈ అరుపులు.. గజ్జెల శబ్దాలు.. జాయపుని అరుపులు.. ముమ్మడికి ఏమీ అర్థం కావడంలేదు. కాసేపటికి అరుపులు, చావుకేకలు, గజ్జెల శబ్దాలు.. ఆగిపోయి అంతటా అందరూ రొప్పుతున్న శబ్దాలు.. దెబ్బలతో మూలుగులు వినిపిస్తున్నాయి.

అందులో జాయపుడు ఉన్నాడో లేడో ఆచూకీ తెలియడంలేదు ముమ్మడికి. రెండు లిప్తలకాలం చూసి లేచి కాగడా వెలిగించాడు. కళ్లముందు కనిపించిన దృశ్యం చూసి అతనికి బతుకు మీద విరక్తి పుట్టింది. అతని మనుషులంతా చచ్చిపడి ఉన్నారు. కాస్త పక్కగా కింద కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నాడు జాయపుడు. అతని తలను గారంగా నాకుతూ విక్రమ..

అంత భయానక వాతావరణంలోనూ ముమ్మడిని ఆకర్షించింది గజ్జెల పట్టీ. ఓ సైనికుడి చేతికి కట్టి ఉంది. మరొకటి జాయపుని చేతికి కట్టి ఉంది.

తాపీగా చెప్పాడు జాయపుడు.

''ఓ వెధవకు గజ్జె కట్టాను. నేనే అనుకుని మిగతా వారంతా వాణ్ని కుళ్ల బొడిచారు. అనంతరం గజ్జెలపట్టీని మరొకడికి కట్టాను. అంతా వాణ్ని కొట్టికొట్టి చంపేశారు. అలా అలా మీవాళ్లందరికీ గజ్జెలు కడుతుంటే.. మీవాళ్లే మీవాళ్లను చంపేశారు!''.

జాయపుని పోరాట విన్యాసాల్లోని అద్భుతతత్వం ముమ్మడికి అర్థమయ్యేలోగా.. చిరుతపులిలా చెంగున ఎగిరి అతణ్ని ఒడిసి పట్టుకున్నాడు జాయపుడు. అతని ముష్టిఘాతాలకు ముమ్మడి పిచ్చికేకలు పెట్టసాగాడు. కాసేపు కందుకక్రీడ ఆడి ముమ్మడి లేచిన ఆసనంపై కూర్చుని, నరసింహావతారునిలా ముమ్మడిని ఒడిలో పెట్టుకుని.. లాఘవంగా కర్రను విరిచినట్లు నడుము విరవడానికి పైకి ఎత్తాడు.

''జాయప సేనాని! శరణు.. శరణు. క్షమించి అతణ్ని విడిచిపెట్టు!''..

ఎప్పుడు వచ్చాడో బిగ్గరగా ఏడుస్తూ కాళ్లపై పడి వేడుకుంటున్న గొంతు పుళిందపుడిది.

లిప్తకాలం ఆగి ఉద్రేకంతో మళ్లీ అరిచి.. ముమ్మడిని పైకి ఎత్తాడు జాయపుడు.

''ఒక్క విరుపు.. నడుము విరిచి వదిలేస్తాను పుళిందపా! అదీ నువ్వు చెప్పావని మాత్రమే సుమా!''.

బావురుమన్నాడు పుళిందపుడు.

''వద్దు వద్దు. దయచేసి విడిచిపెట్టు. నడుం విరిగితే సంసారానికి పనికిరాడు బిడ్డ! దయ చూడు సేనానీ!''.

జాయపునికి కళ్లముందు ఓ స్త్రీమూర్తి లీలామా